తెలుగు ధార్మిక ఆధ్యాత్మిక మాసపత్రిక

పైగామ్ ఎ హిదాయత్

సంపుటి: 5 సంచిక: 4 ఏప్రిల్ 2017 వెల: 20/-

పర్యవేక్షకులు

మౌలానా ముహమ్మద్ అబ్దుల్ ఖవీ

సంపాదకులు

ముహమ్మద్ ఉమర్ ఫారూఖ్

అధ్వర్యం:

ముఫ్తీ సులైమాన్ అజ్మల్ మజాహిరీ

మీ సలహాలు, సందేహాలు,
ఫిర్యాదుల కొరకు సంప్రదించండి

Editor, Paigham e Hidayath,
17-1-391/2/79/A,
Khaja Bagh Colony,
Saidabad, Hyderabad - 500059.
Phone: 9030557865

బ్యాంక్ ఎకౌంట్ వివరాలు

Ac. no:035210011034204
MOHD ABDUL QAVI,
ANDHRA BANK,
MALAKPET BRANCH
IFSC Code: ANDB0000352

paighamehidayath.tk

విషయ సూచిక: ఫెహ్‌రిస్తే మజామీన్:

ఖుర్‌ఆన్ సందేశం:

సూరే నూర్ 5

హదీస్ సందేశం:

సత్యాసత్యాలు 8

సీరతున్నబీ

ప్రవక్త (ﷺ) వారి శుభజననం 11

ప్రత్యేక వ్యాసం:

ద్వంద్వ వైఖరి 15

మేరాజున్నబీ (ﷺ) 17

సందేహాలు సమాధానాలు 10, 17

దర్సే ఖుర్‌ఆన్:

సూరే నూర్ 28

దర్సే హదీస్:

సిద్కో అమానత్ 31

దర్సే సీరత్:

విలాదతే రసూల్ (ﷺ) 34

ఖుసూసీ మజ్మూన్

దోరుఖేపన్ కీ ముమానఅత్ 38

మేరాజున్నబీ (ﷺ) 40

సువాలో జవాబ్ 50

చరితార్థులు:

ముహమ్మద్ షేర్ అలీ 27

పత్రికలో రచయితలు వ్యక్తం చేసే అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

సూరతున్ నూర్

ఖుర్ఆన్ సందేశం

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో

"సూర ఎ నూర్, సూర ఎ నిసా, సూర ఎ అహ్జాబ్" ఈ మూడు సూరాలలో స్త్రీలకు సంబంధించిన చాలా ముఖ్యమైన విషయాలు, సామాజిక నియమాలు, కట్టుబాట్లు వివరించబడ్డాయి.

سُوْرَةٌ اَنْزَلْنٰهَا وَفَرَضْنٰهَا وَاَنْزَلْنَا فِيْهَاۤ اٰيٰتٍۢ بَيِّنٰتٍ لَّعَلَّكُمْ تَذَكَّرُوْنَ ۝١

సూరతున్ అన్‌జల్‌నాహా వ ఫరజ్‌నాహా వ అన్‌జల్‌నా ఫీహా ఆయాతిమ్ బయ్యినాత్ లఅల్లకుమ్ తజక్కరూన్

ఇది మేము అవతరింపజేసిన (ఒక) సూరా. మరి మేమే దానిని విధించాము. మీరు జ్ఞాపకముంచుకునేందుకు, అందులో మేము స్పష్టమైన ఆయతులను (ఆజ్ఞలను) అవతరింపజేశాము.

اَلزَّانِيَةُ وَالزَّانِيْ فَاجْلِدُوْا كُلَّ وَاحِدٍ مِّنْهُمَا مِائَةَ جَلْدَةٍ ۖ

అజ్జానియతు వజ్జానీ ఫజ్‌లిదూ కుల్ల వాహిదిమ్ మిన్‌హుమా మిఅత జల్‌దహ్

వ్యభిచారం చేసే స్త్రీ, వ్యభిచారం చేసే పురుషుడు వారిద్దరిలో ఒక్కొక్కరికి నూరేసి కొరడా దెబ్బలు కొట్టండి.

وَّلَا تَاْخُذْكُمْ بِهِمَا رَاْفَةٌ فِيْ دِيْنِ اللّٰهِ اِنْ كُنْتُمْ تُؤْمِنُوْنَ بِاللّٰهِ وَالْيَوْمِ الْاٰخِرِ ۚ

వలా తఅఖుజ్‌కుమ్ బిహిమా రఅఫతున్ ఫీదీనిల్లాహి ఇన్ కున్‌తుమ్ తుఅమినూన బిల్లాహి వల్ యౌమిల్ ఆఖిరి

మీరు అల్లాహ్ పై, అంతిమదినం పై విశ్వాసం గలవారే అయితే వారిపై దైవాజ్ఞను విధించేటప్పుడు మీకు ఎంతమాత్రం జాలి రాకూడదు.

وَلْيَشْهَدْ عَذَابَهُمَا طَآئِفَةٌ مِّنَ الْمُؤْمِنِيْنَ ۝٢

వల్ యష్‌హద్ అజాబహుమా తాయిఫతుమ్ మినల్ ముఅ్‌మినీన్

పైగా వారిని శిక్షించే సమయంలో ముస్లింలలో కొంతమంది అక్కడ ఉండాలి.

ఇది మేము అవతరింపజేసిన (ఒక) సూరా.

"ఆ మాటకొస్తే దివ్య ఖుర్‌ఆన్ లోని సూరాలన్నీ అల్లాహ్ అవతరింపజేసినవే. కాని ఈ సూరా గురించి ఆయన ప్రత్యేకంగా ఇలా అన్నాడంటే ఇందులో వివరించబడిన ఆదేశాలను గురించి ముస్లింలకు మరింత గట్టిగా నొక్కిచెప్పాలన్నది ఆయన అభిమతం అన్నమాట."

వారిద్దరిలో ఒక్కొక్కరికి నూరేసి కొరడా దెబ్బలు కొట్టండి

ఇస్లాం ప్రారంభంలో వ్యభిచారానికి పాల్పడే స్త్రీపురుషులకు విధించబడిన శిక్ష గురించి సూర ఎ నిసా 15వ ఆయతులో ప్రస్తావించబడింది. అదేమిటంటే:

వల్లాతీ యఅ్‌తీనిల్ ఫాహిషత మిన్ నిసాయికుమ్ ఫస్‌తష్‌హిదూ అలైహిన్న అర్‌బఅతమ్ మిన్‌కుమ్ ఫ ఇన్ షహిదూ ఫమ్‌సికూ హున్న ఫిల్ బుయూతి హత్తా యతవఫ్ఫాహున్నల్ మౌతు అవ్ యజ్‌అలల్లాహు లహున్న సబీలా

"మీ స్త్రీలలో ఎవరయినా అక్రమ సంబంధం పెట్టుకుంటే వారికి వ్యతిరేకంగా మీలోని నలుగురు వ్యక్తులను సాక్షులుగా తీసుకురండి. వారు గనక సాక్ష్యం ఇస్తే ఆ స్త్రీలను మరణకాలం వచ్చే వరకుగానీ, లేదా అల్లాహ్ వారికోసం ఏదైనా మార్గాంతరం సూచించేవరకు గానీ గృహాల్లో నిర్బంధించి ఉ ంచండి."

ఈ శిక్ష తాత్కాలికంగా అమలుపరచబడింది. ఈ ఆయతులో ఇంకో విషయం కూడా గమనార్హం. అరబీ భాషలో మూడు నుంచి పది వరకు వస్తువుల సంఖ్య స్త్రీలింగపదమై ఉండాలి. ఒకవేళ వస్తువులు స్త్రీలింగమైతే వాటిని సూచించే సంఖ్య పులింగం వాడబడాలి. ఇక్కడ ఆయతులో "అర్‌బఅహ్" అని వచ్చింది. అర్‌బఅహ్ అంటే నాలుగు లేక నలుగురు అని అర్థం. ఇది (అంటే అర్‌బఅహ్) స్త్రీలింగ పదం. కాబట్టి దీని తర్వాత ఎలాగయినా పులింగపదమే రావాలి. ఆ పదం "రిజాల్" అవుతుంది. రిజాల్ అనగా పురుషులు అని అర్థం. అంటే నలుగురు పురుషులన్నమాట!

మొత్తానికి తెలిసేదేమిటంటే, ఎవరయినా వ్యభిచారానికి పాల్పడ్డారని ఆరోపించదలచినప్పుడు దానికి నలుగురు పురుషుల సాక్ష్యం తప్పనిసరి. అంటే ఇస్లాం ధర్మం వ్యభిచార నేరానికి ఎంత కఠినమైన శిక్ష విధించిందో, ఆ నేరాన్ని రుజువు చేయటం కోసం కూడా అంతే కఠినమైన షరతును విధించింది. అదీ ఒకటీ రెండూ కాదు, నాలుగు సాక్ష్యాలు కావాలి. కళ్ళారా చూసినట్లు నలుగురు సాక్షులు ముందుకు రానంతవరకూ షరీయతుపరంగా శిక్ష విధించటానికి ఆస్కారం ఉండదు.

వారికోసం ఏదైనా మార్గాంతరం సూచించేవరకు

వ్యభిచారానికి పాల్పడిన వారిని ఇంట్లోనే నిర్బంధించే శిక్ష ఇది అల్లాహ్ వారి కోసం మరో మార్గాంతరము అనగా మరో శిక్షను ప్రవేశపెట్టేంత వరకు వారికి విధించబడే తాత్కాలిక శిక్ష అని

అల్లాహ్ దీని ద్వారా సూచించారు. ఆ తరువాత సూర ఎ నూర్ యొక్క రెండవ వచనాన్ని అవతరింపజేసి అల్లాహ్ తఆలా వారి కొరకు శాశ్వతంగా మరో శిక్షను విధించాడు. అదేమిటంటే "వ్యభిచారం చేసే స్త్రీ, వ్యభిచారం చేసే పురుషుడు వారిద్దరిలో ఒక్కొక్కరికి నూరేసి కొరడా దెబ్బలు కొట్టండి".

ఇక్కడ గ్రహించవలసిన విషయము ఏమిటంటే ఈ శిక్ష వ్యభిచారానికి పాల్పడిన వారందరికీ కాదు. కేవలం పెళ్ళి కాని వారెవరయినా ఈ సిగ్గుమాలిన పనికి పాల్పడితే వారికి మాత్రమే 100 కొరడా దెబ్బలు కొట్టడం జరుగుతుంది. ఒక వేళ పెళ్ళయినవారు ఈ కార్యానికి పాల్పడితే వారిని రజమ్ అనగా రాళ్ళతో కొడుతూ మరణయాతనకు గురిచేయడం జరుగుతుంది.

సూర ఎ నూర్ లోని ఈ ఆయతు అవతరించగానే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఇలా ప్రకటించారు: "అల్లాహ్ తాను చేసిన వాగ్దానం ప్రకారం వ్యభిచారానికి పాల్పడిన స్త్రీ పురుషులకు ప్రత్యేకమైన శిక్షను నిర్ధారించాడు. దాన్ని ఎలా అమలు పరచాలో మీరు నా దగ్గర నేర్చుకోండి. అదేమంటే, వ్యభిచారం చేసినవారు అవివాహిత స్త్రీ పురుషులైతే వారికి నూరేసి కొరడా దెబ్బల చొప్పున కొట్టండి. ఆ పని చేసినవారు వివాహిత స్త్రీ పురుషులైతే నూరేసి కొరడా దెబ్బలతోపాటు రాళ్ళు రువ్వే శిక్షను కూడా అమలుపరచండి. (సహీ ముస్లిం: కితాబుల్ హుదూద్) ఆ తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు వివాహితులైన వ్యభిచారులకు రాళ్ళు రువ్వే శిక్షను అమలు పరిచారు. నూరు కొరడా దెబ్బల శిక్ష కూడా అందులో వచ్చేసింది. కాబట్టి ఇప్పుడెవరయినా వివాహం తరువాత కూడా వ్యభిచారానికి పాల్పడితే కేవలం రాళ్ళు రువ్వే శిక్ష మాత్రమే ఉంటుంది. మహా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి తదనంతరం మార్గదర్శక ఖలీఫాల కాలంలోనూ, సహాబీల కాలంలోనూ ఈ శిక్షే అమలుపరచబడింది.

వారిపై దైవాజ్ఞను విధించేటప్పుడు మీకు ఎంతమాత్రం జాలి రాకూడదు

అంటే దుర్మార్గులపై జాలితో శిక్షను ఉపసంహరించుకోవటంగానీ, సడలించటంగానీ చేయకూడదు. స్వాభావికంగా ఇక్కడ దయాదాక్షిణ్యాలను కనబరచటమంటే అది విశ్వాస బలహీనతే.

వారిని శిక్షించే సమయంలో ముస్లింలలో కొంతమంది అక్కడ ఉండాలి.

బహిరంగంగా శిక్షను అమలుపరచటంలోని ప్రధాన ఉద్దేశం ఆ సంఘటన ద్వారా ప్రజాబాహుళ్యం గుణపాఠం గ్రహించాలన్నదే ! సమాజంలో పరివర్తన రావాలన్నదే !! కాని దురదృష్టపుశాత్తు నేడు ఇలాంటి బహిరంగ శిక్షలను క్రూరత్వానికి, రాక్షసత్వానికి ప్రతీకగా చిత్రీకరించటం జరుగుతోంది. ఈ ఆలోచన పసలేనిది. అజ్ఞానంతో కూడుకున్నది. పైగా ఇది దైవాదేశాలపై తిరుగుబాటుకు ఆనవాలు వంటిది. ఈ చట్టాన్ని ఆటవిక చట్టంగా అభివర్ణించేవారు, తాము మానవతపాలిట దేవునికన్నా గొప్ప దయార్ద హృదయులుగా నిరూపించుకో గోరుతున్నారన్నమాట ! వాస్తవానికి దేవునికన్నా గొప్ప క్షమాశీలి, దయాశీలి ఎవరుంటారు?

మీ సంవత్సరపు చందా మా అంకౌంట్‌లో డిపాజిట్ చేసేటప్పుడు మా IFSC Code వ్రాయడం మరువకండి. అలాగే డిపాజిట్ చేసిన తరువాత మాకు ఫోన్ చేసి తప్పక తెలుపండి. లేకపోతే డబ్బులు డిపాజిట్ చేసిన వారి వివరాలు మాకు తెలియవు. మా IFSC Code ANDB0000352

హదీస్ సందేశం

సత్యాసత్యాలు

దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి బోధనల్లో సత్యసంధతకు, అమానతు (అప్పగింత)కు ఒక ప్రత్యేక ప్రాముఖ్యం ఉంది. ఇవి లేకుండా ఈమాన్ (విశ్వాసం) లేదు. అసత్యం పలకడం, అమానతులను కాజేయడం, వాగ్దాన భంగం మొదలైనవి కావట్య గుణంలో (మునాఫఖత్‌లో) ప్రధానమైనవి. ఈ చెడులు ఎవరిలో ఉంటాయో అతడు మునాఫిఖ్ (కపటి).

ఇదేవిధంగా, 'ఎవరిలో అమానతు లేదో వారిలో ఈమాన్ లేదు' అన్న హదీసు కూడా హదీసు గ్రంథాలలో లిఖించబడి ఉంది. అంతేకాదు 'మోమిన్ (విశ్వాసి) అబద్ధాలు చెప్పే అలవాటు కలిగి ఉండడు' అని కూడా ఆ హదీసులో చెప్పబడింది.

ఇప్పుడిక్కడ, సత్యసంధత, అసత్యవాదన, అమానతును కాజేయడం తదితర అంశాలకు సంబంధించి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి కొన్ని హదీసులను పొందపరుస్తున్నాము.

హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె మస్‌ఊద్ రజియల్లాహు అన్‌హు గారి ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా ఉపదేశించారు:

"మీరు సత్యాన్ని అంటిపెట్టుకొని ఉండండి. సదా సత్యమే పలకండి. ఎందుకంటే సత్యం సత్కార్యాల వైపు గొనిపోతుంది. సత్కార్యం స్వర్గం వరకు చేరుస్తుంది. మనిషి ఎల్లప్పుడూ సత్యమే పలుకుతున్నట్లయితే, సత్యాన్నే అవలంభిస్తున్నట్లయితే అతడు సిద్దీకుల స్థానానికి చేరుకుంటాడు. అల్లాహ్ దగ్గర సిద్దీకుల జాబితాలో అతని పేరు వ్రాయబడుతుంది.

అలాగే అసత్యానికి ఎల్లప్పుడూ దూరంగా ఉండండి. ఎందుకంటే, అసత్యం పలికే అలవాటు మనిషిని చెడుమార్గాన పడవేస్తుంది. ఆ చెడు అతన్ని నరకం వరకు చేరుస్తుంది. మనిషి అబద్ధానికి అలవాటు పడినట్లయితే, అబద్ధాన్నే అవలంభించినట్లయితే, ఫలితంగా అతడు అల్లాహ్ దగ్గర అసత్యవాదిగా వ్రాయబడతాడు".

(బుఖారి, ముస్లిం)

సందేశము:

అంటే, సత్యం పలకడం స్వతహాగా ఒక మంచి అలవాటు. దీనికి మరో ప్రత్యేకత ఉంది. ఇది మనిషిని, అతని జీవితంలోని ఇతర రంగాల్లో కూడా సత్‌ప్రవర్తన కలిగిన వాడుగా తయారుచేసి స్వర్గానికి అర్హునిగా చేస్తుంది. ఎప్పుడూ సత్యమే మాట్లాడే మనిషి సిద్దీకుల స్థానానికి చేరుకుంటాడు.

ఇదేవిధంగా అసత్యం పలకడం స్వతహాగా ఒక చెడ్డ అలవాటు. ఈ రుగ్మతకు కూడా ఓ ప్రత్యేకత ఉంది. ఇది మనిషిని పాపాలు, దుష్కార్యాల వైపుకు గొనిపోయి, అతడి పూర్తి జీవితాన్ని దుష్కార్యాలతో

కలుషితం చేసి నరకం దాకా తీసుకుపోతుంది. అంటే అబద్ధమాడడమే తన అలవాటుగా చేసుకున్న వ్యక్తి అసత్యవాది స్థానానికి చేరుకొని, శాపగ్రస్తుడుగా మారిపోతాడు.

హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ ఖురాద్ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనం ప్రకారం, "ఒకరోజు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు వజూ చేశారు. అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి సహచరులు ఆ వజూ నీరు తీసుకొని చల్లుకున్నారు."

అప్పుడు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు, "మీరు ఇలా చేయడానికి ఏ విషయం ప్రేరిగొలిపింది" అని ప్రశ్నించారు.

"అల్లాహ్, ఆయన ప్రవక్త పట్ల ప్రేమ" అని వారు బదులిచ్చారు.

ఈ సమాధానం విన్న ప్రవక్త మహనీయులు, "అల్లాహ్, ఆయన ప్రవక్త పట్ల నిజమైన ప్రేమ కావాలని, లేక అల్లాహ్, అల్లాహ్ ప్రవక్త అతణ్ని ప్రేమించాలని ఎవరైతే కోరుకుంటారో, అలాంటి వారు మాట్లాడేటప్పుడు సతతం సత్యమే పలకాలి. వారికి ఏదైనా అమానతు అప్పగిస్తే వారు దాన్ని కాజేయకుండా దాని అసలుదారునికి అప్పగించాలి, తన పొరిగింటివారి పట్ల సత్ప్రవర్తనతో మసలుకోవాలి" అని సెలవిచ్చారు.

(బైహఖీ)

సారాంశం:

ఈ హదీసు ద్వారా మనకు అర్థమైన విషయం ఏమిటంటే, అల్లాహ్, అల్లాహ్ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ప్రేమకు, స్వచ్ఛమైన సంబంధానికి మొట్టమొదటి షరతు, సత్యం పలకడం, అమానతుదారుడుగా రూపొందడం, అసత్యం, వంచనలకు పూర్తిగా దూరంగా ఉండడం. ఒకవేళ ఈ గుణాలే గనక లేకుండా దైవంపట్ల, దైవ ప్రవక్త పట్ల గొప్ప ప్రేమ ఉందని ఎన్ని ప్రగల్భాలు పలికినా అదంతా శుద్ధ అబద్ధమే కాకుండా, ఒక విధమైన కాపట్యం కూడా.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఇలా ఉపదేశించారని, హజ్రత్ ఉబాదా బిన్ సామిత్ రజియల్లాహు అన్హు వారు ఉల్లేఖించారు:

"మీరు ఆరు విషయాల బాధ్యతను స్వీకరించి, నాకు వాటి హామీ ఇవ్వండి. మీకు స్వర్గ ప్రవేశం కల్పించే బాధ్యత నేను తీసుకుంటాను".

(ఆ ఆరు విషయాలు ఇవి):

ఎప్పుడు మాట్లాడినా సత్యమే పలకండి, మీరు ఎవరికైనా వాగ్దానం చేస్తే దాన్ని నెరవేర్చండి, మీకు ఏదైనా అమానతు అప్పగిస్తే, దాన్ని యథాతథంగా తిరిగి అప్పగించండి, నిషిద్ధకార్యాల నుండి మీ మర్మాంగాలను కాపాడుకోండి, ఏ వస్తువుల వైపు చూడవద్దని వారించడం జరిగిందో, వాటి వైపు కన్నెత్తి చూడకండి. అంటే వాటి పై దృష్టి పడకుండా చూసుకోండి. ఏ సందర్భాల్లో చేతిని నియంత్రించమని ఆదేశించబడిందో, అక్కడ మీ చేతిని నియంత్రించుకోండి. (అంటే, నిష్కారణంగా ఒకరిని కొట్టడం, హింసించడం, ఎవరి వస్తువునైనా కాజేయడం, మొదలగు పనుల నుండి మీ చేతిని నియంత్రించుకోండి అని అర్థం).

(ముస్నదే అహ్మద్)

సారాంశం:

అంటే, ఒక వ్యక్తి అల్లాహ్‌ను విశ్వసించి, 'ఫరాయిజ్'ను (అంటే తనపై మోపబడిన ముఖ్య విధులను) నెరవేరుస్తూ, ఈ ఆరు మౌలిక సుగుణాలను కూడా సక్రమంగా ఆచరిస్తుంటే,

అతను తప్పకుండా స్వర్గవాసే అన్నమాట. ఇలాంటి వారికి అల్లాహ్, ఆయన ప్రవక్త తరఫున స్వర్గ శుభవార్త ఇవ్వడం జరిగింది.

"సత్యసంధుడు, న్యాయశీలి అయిన వర్తకుడు అంబియాలు (ప్రవక్తలు), సిద్దీకులు (సత్యసంధులు), షహీదులు (అల్లాహ్ మార్గంలో అమరులైనవారు)ల వెంట ఉంటాడు" అని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ సెలవిచ్చినట్లు హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ రజియల్లాహు అన్హు వారు ఉల్లేఖించారు.

(తిర్మిజీ, దార్మి)

సంగ్రహణ:

అంటే, దైవసామిప్యపు ఉన్నత శిఖరాలను అందుకోవడానికిగాను ప్రపంచాన్ని, ప్రాపంచిక కార్యకలాపాలను త్యజించాల్సిన అవసరం ఎంతమాత్రం లేదని ఈ హదీసు స్పష్టంగా వెల్లడిస్తోంది. ఒక వర్తకుడు అంగడిలో కూర్చొని, దైవం, దైవ ప్రవక్త ఉపదేశాలకనుగుణంగా, నీతి నిజాయితీలాంటి ధార్మిక వైఖరినవలంబిస్తూనే, పరలోకంలో దైవ ప్రవక్తలు, సిద్దీకులు, షహదాల సహచర్యాన్ని పొందగలడు.

హజ్రత్ ఉబైద్ బిన్ రిఫాఅహ్ తన తండ్రిగారైన హజ్రత్ రిఫాఅహ్ రజియల్లాహు అన్హు వారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి నుండి విన్న ఈ విషయాన్ని ఇలా ఉల్లేఖించారు:

''వ్యాపారాల్లో ధైవభీతి, సత్ప్రవర్తన, నీతినిజాయితి, సత్యసంధతలు కల వర్తకులు తప్ప, వర్తకులంతా ప్రళయదినాన దుష్టులుగా, దుర్మార్గులుగా లేపబడతారు".

(తిర్మిజీ, ఇబ్నె మాజహ్)

సందేహాలు సమాధానాలు

1. నఫిల్ నమాజులు ఇంట్లో చేయాలా?

జ: నఫిల్ నమాజులను ఇంట్లో చేయడం అభిలషణీయమైన పద్ధతి. ఎన్నో హదీసులలో దీని ప్రస్తావన వచ్చింది.

(1) హజ్రత్ జైద్ బిన్ సాబిత్ రజియల్లాహు అన్హు గారి కథనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఈ విధంగా ప్రవచించారు: ప్రజల్లారా ! మీరు మీ ఇండ్లల్లో (కూడా) నమాజు చేస్తూ ఉండండి. ఒక్క ఫరజ్ నమాజ్ తప్ప మనిషి తన ఇంట్లో చేసుకునే నమాజే అత్యుత్తమమైనది. (బుఖారీ; ముస్లిం)

ఫరజ్ నమాజును మసీదులో సామూహికంగా నెరవేర్చవలసి ఉంటుంది. ఇకపోతే మిగిలిన సున్నత్, నఫిల్ నమాజులను ఇంట్లో, మస్జిద్‌లో ఎక్కడైనా చేసుకోవచ్చు. అయితే వాటిని ఇంట్లో చేసుకోవటమే ఉత్తమం. పై హదీసులో సున్నత్, నఫిల్ నమాజులను ఇంట్లో చేసుకోవాలని ఆదేశించబడింది.

(2) హజ్రత్ ఇబ్నె ఉమర్ రజియల్లాహు అన్హు వారి కథనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఈ విధంగా ప్రవచించారు: మీ నమాజుల్లో కొన్నింటిని మీ ఇండ్ల కొరకు ప్రతేఖీయకించుకోండి. వాటిని (అనగా మీ ఇండ్లను) శ్మశానాలుగా చేసుకోకండి. (బుఖారీ; ముస్లిం)

ఇంట్లో నమాజు చేయకపోతే ఆ ఇల్లు శ్మశానంలా తయారవుతుంది. శ్మశానాల్లో ఆచరణ, ఆరాధనలు జరుగవు. అలాగే ఇండ్లలో నమాజు చేయకపోతే ఆ ఇంటి మనుషుల్లో కూడా ఆచరణ, ఆరాధనా భావాలు సమసిపోతాయని ఈ హదీసు హెచ్చరిస్తోంది.

ఆదర్శమూర్తి ﷺ

సీరత్తున్నబీ

తాతగారి కారుణ్య ఛాయలో

వృద్ధుడైన అబ్దుల్ ముత్తలిబ్ తన మనుమణ్ణి వెంటబెట్టుకొని మక్కాకు వచ్చారు. ఆయన హృదయం తన అనాథ మనుమడి మమతానురాగాలతో నిండి పరితపిస్తోంది. కారణం, కోడలి మరణం మరో క్రొత్త విఘాతం. ఇది పాత గాయాల్ని తిరిగి తోడేసిన సంఘటన. అబ్దుల్ ముత్తలిబ్ భావోద్రేకాల్లో తన మనుమని ఎడల గల తపన, హృదయ స్పందన, ఆయన సొంత కుమారుల ఎడల కూడా కానావచ్చేది. విధీ ఆ బాలుణ్ణి ఏకాంతపు ఎడారిలో తెచ్చి నిలబెట్టిన తీరును చూసి అబ్దుల్ ముత్తలిబ్ తల్లడిల్లిపోయారు. బాలుణ్ణి ఎటూకాకుండా చేయడానికి ఆయన సిద్ధపడలేదు. తన సంతానం కంటే ప్రేమిస్తూ, పెద్దవారిని గౌరవించినట్లు ఆయనను గౌరవించేవారు. ఇబ్నె హిషామ్ కథనం ప్రకారం, అబ్దుల్ ముత్తలిబ్ కోసం కాబా గృహం నీడన పరుపు వేసి, కుమారులంతా దాని చుట్టూ క్రింద కూర్చునేవారు. అబ్దుల్ ముత్తలిబ్ వచ్చి ఆ పరుపుపై కూర్చునేవారు. ఆయన గౌరవార్థం ఏ కుమారుడూ ఆ పరుపు దగ్గరకు కూడా పోయేవాడు కాదు. కాని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వచ్చి ఆ పరుపుపైన్నే కూర్చునేవారు. ఆయన ఇంకా చిన్న పిల్లవాడే. పినతండ్రులు ఆయన్ను పరుపుపై నుండి క్రిందకి తెచ్చి కూర్చోబెట్టేవారు. అలా చేస్తూ ఉండగా అబ్దుల్ ముత్తలిబ్ కుమారుల్ని ఉద్దేశించి, "నా ఈ కుమారుణ్ణి వదిలేయండి. దైవసాక్షి ! ఈయన ఘనతే వేరు" అంటూ తిరిగి పిల్లవాణ్ణి ఎయ్యుకొని తన దగ్గర కూర్చుండబెట్టుకొని వీపు తట్టేవారు. అతని చేష్టలు చూసి ఆనందపడేవారు.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి వయస్సు ఇంకా ఎనిమిది సంవత్సరాల రెండు నెలల పది రోజులైందో లేదో అబ్దుల్ ముత్తలిబ్ సానుభూతి ఛాయ కూడా ఆయనకు దూరమైపోయింది. అబ్దుల్ ముత్తలిబ్ మక్కాలో మరణించారు. మరణానికి ముందు ఆయన ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి పినతండ్రి అయిన అబూతాలిబ్‌కు సంరక్షణ బాధ్యతలను స్వీకరించమని అప్పజెప్పడం జరిగింది.

పినతండ్రి ప్రేమ ఛాయలో

అబూతాలిబ్ తన సోదర కుమారుని సంరక్షణా బాధ్యతలను ఎంతో చక్కగా నిర్వర్తిస్తూ ఆయన్ను తన కుమారునిలా చూసుకున్నారు. మరీ చెప్పాలంటే అంతకు మిన్నగానే చూసుకున్నారు. ఆయన ఎడల ఎంతో గౌరవంగా మెలుగుతూ నలభై ఏండ్ల కంటే అధిక కాలం వరకు ఆయనకు అండదండగా నిలిచారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ విషయమై శతృత్వం, మిత్రత్వం వివరాల సందర్భానుసారం రాబోతున్నాయి.

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ మాధ్యమంగా వర్షం గురించి వేడుకోలు

జుహ్లిమా బిన్ అరఫ్తా ఉల్లేఖనాన్ని ఇబ్నె అసాకిర్ పొందుపరచిన విధం ఇలా ఉంది. జహ్లిమా ఇలా ఉల్లేఖించారు: "నేను మక్కా నగరానికి వచ్చినప్పుడు ప్రజలు కరువుతో పీడించబడుతున్నారు. ఖురైష్‌లు అబూ తాలిబ్‌తో "అబూ తాలిబ్ ! మన నగరం కరువుకోరల్లో చిక్కుకొని ఉంది. చిన్నా పెద్దా అందరూ పస్తులుంటున్నారు. పదండి, వర్షం గురించి ప్రార్థిద్దాం" అని అన్నారు. అబూతాలిబ్ ఓ పిల్లవాణ్ణి తీసుకొని బయలుదేరారు. పిల్లవాడు అప్పుడే మబ్బు వదలిన సూర్యునిలా ప్రకాశిస్తున్నాడు. ఆ బాలుని చుట్టూ ఇతర బాలురు కూడా ఉన్నారు. అబూతాలిబ్ ఆ బాలుని చేయి పట్టుకొని కాబా గృహం వద్దకు వెళ్ళారు. అతని వీపును కాబా గృహానికి ఆనించి వ్రేలు పట్టుకొని నిలబడ్డారు. అప్పుడు ఆకాశంలో ఓ మబ్బుతునక మచ్చుకైనా కనబడలేదు. కాని చూస్తూ ఉండగానే అన్ని వైపుల నుండి మేఘాలు క్రమ్ముకోనారంభించాయి. కురిసిన కుంభవృష్టికి ఆ లోయలో వరదలు వచ్చాయి. నగరం, కొండాకోనలన్నీ జలమయమైపోయాయి. ఆ తరువాత ఓ సందర్భంగా అబూతాలిబ్ ఈ సంఘటన గురించి చెబుతూ, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్‌ను ఇలా పొగిడారు.

"ఆయన అందగాడు. ఆయన ముఖారవిందం ద్వారా వర్షాన్ని కోరుకోవడం జరుగుతుంది. అనాధల ఆశ్రయం, వితంతువుల సంరక్షకుడాయన.

క్రైస్తవ సన్యాసి బుహైరా

అనుమానాస్పద ప్రామాణికతలు గల కొన్ని ఉల్లేఖనాల ప్రకారం, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి వయస్సు పన్నెండేళ్ళు, మరో వివరణాత్మక ఉల్లేఖనం ప్రకారం, పన్నెండేళ్ళ రెండు నెలల పది రోజులకు చేరినప్పుడు అబూతాలిబ్ ఆయన వెంట పెట్టుకొని సిరియాకు వ్యాపార రీత్యా ప్రయాణానికి బయలుదేరి 'బస్రా' చేరారు. 'బస్రా' సిరియా దేశానికి చెందిన 'హూరాన్'కు రాజధానిగా ఉండేది. రోమనులు ఆక్రమించుకున్న అరేబియా ద్వీపకల్ప ప్రాంతాలకు రాజధాని అది. ఆ నగరంలో 'బుహైరా' అనే బిరుదుతో పిలువబడే జర్జిస్ అనే పేరుగల ఓ క్రైస్తవ సన్యాసి ఉండేవాడు. బిడారం అక్కడ విడిది చేయగానే ఆ సన్యాసి తన చర్చీ నుండి బయలుదేరి వారి వద్దకు వచ్చాడు. వారినందరిని భోజనాలకు ఆహ్వానించాడు. ఇంతకుమునుపెన్నడూ ఈ సన్యాసి బయటకు వచ్చేవాడు కాదు. అతను దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్‌ను ఆయన గుణగణాలను చూసి గుర్తుపట్టాడు. ఆయన చేయి పట్టుకొని, "ఈయన విశ్వనాయకుడు. అల్లాహ్ ఈయన్ను కారుణ్యమూర్తిగా చేసి పంపిస్తాడు" అని అన్నాడు. దానికి అబూతాలిబ్. "నీకు ఇదంతా ఎలా తెలుసు?" అని అడగగా, ఆ సన్యాసి, "మీరు ఈ లోయలో అడుగుపెట్టగానే ఇక్కడి ఏ చెట్టూ, ఏ రాయీ ఆయనకు సాష్టాంగపడకుండా లేదు. ఇ వస్తువులు ఓ ప్రవక్త తప్ప మరే దాని ఎదుట సాష్టాంగ పడవు. అదే కాదు, నేనీయనను 'ప్రవక్త గుర్తు' ద్వారా కనుగొన్నాను. ఈ గుర్తు వీపుపై మెడ క్రింద ఉన్న మెత్తటి ఎముకపై పండు ఆకారములో ఉంది. ఇది మా గ్రంథాల్లో ఉన్న విషయం" అని చెప్పాడు.

ఆ తరువాత 'బుహైరా' సన్యాసి అబూతాలిబ్‌ను ఉద్దేశించి, వెంటనే ఈయన్ను వెనక్కు పంపించేయండి. సిరియాకు తీసుకొని వెళ్ళకండి. అక్కడ యూదుల ద్వారా ప్రమాదం పొంచి ఉంది అని చెప్పగా, అబూతాలిబ్ కొందరు బానిసల వెంట ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిని మక్కాకు పంపించేశారు.

ఫుజ్జార్ యుద్ధం

దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ పదిహేనేండ్ల ప్రాయంలో ఉన్నప్పుడు ఫుజ్జార్ యుద్ధం సంభవించింది. ఇది ఖురైష్, వారి మిత్రులు బనూ కనానాకు, ఖైస్ అయిలాన్‌కు నడుమ జరిగిన యుద్ధం. ఖురైష్, కనానాల సైన్యాధ్యక్షుడు హరబ్ బిన్ ఉమయ్యా. ఇతను తన వయస్సు, గౌరవం రీత్యా ఖురైష్ మరియు కనానాల దృష్టిలో పెద్దవాడు. యుద్ధంలో మెదట ఖైస్ తెగకే ఆధిక్యత లభించినప్పటికీ మధ్యాహ్నం అయ్యేసరికి కనానా సైన్యమే ఆధిక్యత సంపాదించింది. ఈ యుద్ధాన్ని, ఫుజ్జార్ యుద్ధం అనడానికి కారణం ఏమిటంటే, ఇది హరమ్ (కాబాగృహం) దగ్గర నిషిద్ధ మాసాలలో జరిగిన యుద్ధం. ఈ రెంటి గౌరవాన్ని మంటగలిపిన యుద్ధం. ఈ యుద్ధంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ కూడా పాల్గొన్నారు. ఆయన ఆ యుద్ధంలో తన పినతండ్రులకు అంబులను అందించారు.

హిల్‌ఫుల్ ఫుజూల్

ఈ యుద్ధం జరిగిన అనంతరం ఓ నిషిద్ధ మాసం 'జీఖాయిదా'లో హిల్‌ఫుల్ ఫుజూల్ అనే ఒప్పందం ఒకటి జరిగింది. కొన్ని ఖురైష్ తెగలు, అంటే బనీ హాషిమ్, బనీ ముత్తలిబ్, బనీ అసద్ బిన్ అబ్దుల్ ఉజ్జా, బనీ జహ్రా బిన్ కిలాబ్ మరియు బనీ ఖైమ్ బిన్ ముర్రాలు దీన్ని నిర్వహించాయి. వీరంతా అబ్దుల్లాహ్ బిన్ జుద్‌ఆన్ తైమీ ఇంట చేరారు. వయస్సులోను, గౌరవంలోను అతను అందరికంటే మిన్నకావడం అందుకు కారణం. అందరూ ఓ మాట మీద నిలబడి, మక్కాలో ఏ పీడితుడు కనబడినా, అతడు మక్కా వాసి అయినా కాకపోయినా సరే, కలసికట్టుగా అతనికి సహాయం చేద్దామని, అతని హక్కును అతనికి ఇప్పిద్దామని ప్రమాణం చేశారు. ఈ ప్రమాణ సభలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ కూడా ఉన్నారు. దైవదౌత్య బాధ్యతలు స్వీకరించిన తరువాత కూడా ఆయన (సల్లల్లాహు అలైహి వసల్లమ్) ఇలా సెలవిస్తూ ఉండేవారు.

"నేను అబ్దుల్లాహ్ బిన్ జుద్‌ఆన్ ఇంట జరిగిన ఒప్పందంలో చేరి ఉన్న వాణ్ణి. దానికి బదులు నాకు ఎర్ర ఒంటెలు కూడా నచ్చవు. ఒకవేళ ఇస్లాంలో నన్ను ఈ ఒప్పందం కోసం పిలిస్తే తప్పక వెళ్ళేవాణ్ణి".

తెగల దురభిమానానికి ఈ ఒప్పందం గొడ్డలిపెట్టు అయింది. దీని వెనుక ఉన్న కారణం ఏమిటంటే, జుబైద్ తెగకు చెందిన ఓ వ్యక్తి వర్తక సామాగ్రు విక్రయించడానికి మక్కా వచ్చాడు. 'ఆస్ బిన్ వాయిల్' అనే వ్యక్తి ఆ సరుకును కొన్నాడు కాని దాని ధర చెల్లించలేదు. అతను తన తెగ మిత్రులైన అబ్దుద్దార్, మగ్జూమ్, జమహ్, సహమ్ మరియు అద్దీ తెగల సర్దారుల సహాయాన్నర్థించగా వారు ఏ మాత్రం శ్రద్ధ తీసుకోలేదు. అప్పుడు ఆ వ్యక్తి అబూఖైస్ కొండపైకెక్కి బిగ్గరగా కొన్ని పద్యపాదాల్ని చదివాడు. ఆ పద్యపాదాల్లో తనకు జరిగిన అన్యాయాన్ని ఏకరుపు పెట్టాడు. అది విన్న జుబైర్ బిన్ అబ్దుల్ ముత్తలిబ్, ఈ వ్యక్తి ఇంత నిస్సహాయుడెలా అయ్యాడు? అని బాధపడుతూ పైన పేర్కొన్న ఖురైష్ తెగలన్నింటిని ఓ చోట చేర్చడం జరిగింది. మొదట ఒప్పందం చేసుకొని ఆ తరువాత ఆస్ బిన్ వాయిల్ నుండి ఆ వ్యక్తికి రావలసిన హక్కును ఇప్పించడం జరిగింది.

శ్రామిక జీవితం:

యుక్తవయస్సులో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ కు నిర్ణీతమైన పని అంటూ ఏదీ లేదు. అయితే, వారు మేకలు కాసేవారని అనేక ఉల్లేఖనాలు చెబుతున్నాయి. వారు మొదట బనీ సాద్ మేకల్ని కాశారు. మక్కాలోనూ మక్కావాసుల మేకల్ని కొన్ని కీరాత్‌ల కూలీపై కాసేవారు. పాతికేండ్ల

వయస్సు రాగానే హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా వారి సరుకును తీసుకొని వ్యాపారార్థం సిరియాకు వెళ్ళారు.

ఇబ్నె ఇస్హాక్ కథనం ప్రకారం, ఖౌలీద్ కుమార్తె ఖదీజా రజియల్లాహు అన్హా ఓ గౌరవనీయమైన ధనవంతురాలైన మహిళ. తన సరుకును భాగస్వామ్య ప్రాతిపదికపై కొందరికిచ్చి వ్యాపారం ఇచేఎయుషడూఅనికి పంపించేవారు. ఖురైష్ తెగ ప్రజల వృత్తి పూర్తిగా వ్యాపారమే. ఆమెకు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి నత్యనంధత, అమానతు భావం, నీతీ నిజాయితీలను గురించి తెలియగా, తన బానిస మైసరా వెంట సిరియా వెళ్ళి తన సరుకును అమ్మమని, ఇతర వ్యాపారులకు ఇచ్చే ప్రతిఫలం కంటే అధికంగా ముట్టజెబుతానని ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి కబురు పంపారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఆమె ఈ కోరికను మన్నించి ఆమె సరుకు తీసుకొని బానిస మైసరా వెంట సిరియాకు వెళ్ళారు.

హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా తో వివాహం:

సిరియాలో వ్యాపారం చేసి తిరిగి వచ్చారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు. హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా వారు తన వ్యాపారంలో జరిగిన అభివృద్ధిని, ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి నిజాయితీని చూసి ముగ్ధురాలై తన బానిస మైసరా ద్వారా విషయాన్ని తెలుసుకున్నారు. మైసరా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి నిజాయితీనీ, ఉన్నత గుణగణాలనూ సందర్భోచితంగా తీసుకున్న నిర్ణయాలను ఏకరువు పెట్టినప్పుడు, ఖదీజా రజియల్లాహు అన్హా తాను పోగొట్టుకున్న ఆణిముత్యం తిరిగి లభ్యం అయినట్లు సంబరపడిపోయారు. అంతకుపూర్వం గొప్ప గొప్ప నర్దారులు, ధనవంతులు ఆమెను వివాహమాడాలని ప్రయత్నం చేసినప్పటికి ఆమె ఒప్పుకోలేదు. ఇప్పుడామె తన మనసులోని మాట తన స్నేహితురాలు 'నఫీసా'కు చెప్పారు. నఫీసా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి దగ్గరకు వెళ్ళి మాట్లాడారు. వారు తమ పినతండ్రితో మాట్లాడారు. ఆ తరువాత వివాహం జరిగిపోయింది. నికాహ్‌కు బనీ హాషిమ్ తెగవారు, ముజర్ ధనవంతులందరూ హాజరయ్యారు.

ఇది సిరియా దేశం నుండి తిరిగొచ్చిన రెండు నెలల తరువాత జరిగిన విషయం. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు 'మెహెర్'గా 20 ఒంటెల్ని హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా వారికిచ్చారు. అప్పుడు హజ్రత్ ఖదీజా రజియల్లాహు అన్హా వారి వయస్సు 40 సంవత్సరాలు. ఆమె వంశం, సంపద, వివేకం రీత్యా తన జాతిలోనే అతి గౌరవనీయురాలైన ఉత్తమ మహిళ. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు వివాహమాడిన మొదటి మహిళ ఈమే. ఆమె జీవించినంత వరకు ఆయన (స) మరో మహిళను వివాహమాడలేదు.

ఒక్క ఇబ్రాహీమ్ తప్ప దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి తక్కిన సంతానమంతా ఆమె గర్భాన జన్మించిందే. ప్రథమంగా జన్మించింది ఖాసిం. ఆయన పేరు మీదనే దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి అబుల్ ఖాసిం అనే పేరు వచ్చింది. ఆ తరువాత జైనబ్, రుకయ్యా, ఉమ్మె కుల్సుమ్, ఫాతిమా, అబ్దుల్లాహ్ (రజి) జన్మించారు. అబ్దుల్లాహ్ నే తయ్యిబ్, తాహిర్ అని పిలిచేవారు. అయితే, కుమారులంతా బాల్యం లోనే మరణించారు. కుమార్తెలందరూ ఇస్లాం హయాం చూశారు, ఇస్లాం స్వీకరించి హిజ్రత్ కూడా చేశారు.

ద్వంద్వవైఖరి

షేక్ మహమ్మద్

ఇద్దరు వ్యక్తులు, లేక రెండు వర్గాల మధ్య ఎప్పుడైనా వైరం, వైరుధ్యం ఏర్పడినట్లయితే, కొంతమంది, ఇరువైపులా సంబంధాలు నెరుపుతూ ఒకరికి వ్యతిరేకంగా ఒకరివద్ద మాట్లాడుతుంటారు. ఇది కొందరికి అలవాటు. ఇదేవిధంగా మరికొంతమంది ఒకరితో కలిసుండి, వారితో సత్సంబంధాలు కొనసాగిస్తూ, వారి పరోక్షంలో వారికి వ్యతిరేకంగా చెడు ప్రచారం చేస్తుంటారు. ఇలాంటి మనిషిని తెలుగు భాషలో "రెండు ముఖాల మనిషి" అంటారు. ఉర్దూలో "దోరుఖా" అని అరబ్బీలో "జుల్‌వజ్‌హైన్" అని అంటారు.

ఇలాంటి వైఖరి ఒక రకమైన కపట వైఖరి, మోసపూరిత వైఖరి అనబడుతుంది. దీనికి దూరంగా ఉండాలని, దీన్నుండి పూర్తిగా సురక్షితంగా ఉండాలని దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ విశ్వాసులకు ఉపదేశించారు. ఈ వైఖరి మహాపాపమని, ఇలాంటి వారు ఘోరమైన శిక్షకు గురికావలసి ఉంటుందని తీవ్రంగా హెచ్చరించారు.

దైవప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా ఉపదేశించారని హజ్రత్ అబూ హురైరహ్ రజియల్లాహు అన్హు వారి ఉల్లేఖించారు:

"మీరు ప్రళయదినాన అందరికంటే నీచమైన స్థితిలో ఒక మనిషిని చూస్తారు. అతడు కొందరి వద్దకు వెళ్ళేటప్పుడు ఒక ముఖంతో, మరికొందరి దగ్గరకు వెళ్ళేటప్పుడు మరొక ముఖంతో వెళ్ళేవాడై ఉంటాడు".

(బుఖారి, ముస్లిం)

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ ఇలా సెలవిచ్చారని హజ్రత్ అమ్మార్ బిన్ యాసిర్ రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు:

"ఇహలోకంలో రెండు నాలుకలు కలిగి ఉన్న మనిషి నోటిలో (మునాఫిఖ్‌కు లాగా ఎవరి దగ్గరికీమాట వారి దగ్గర మాట్లాడేవాడు) ప్రళయదినాన రెండు అగ్ని నాలుకలు ఉంటాయి".

(అబూదావూద్)

సందేశము:

సత్కార్యాలు, సత్ప్రవర్తనలకు పరలోకంలో ప్రతిఫలం లభిస్తుందన్న వాగ్దానముంది. ఈ సత్కర్మలు, సత్ప్రవర్తనల స్థాయీ భేదాన్ని బట్టి వాటి పుణ్యఫలం లభిస్తుంది. అలాగే దుష్కార్యాలు, దుష్ప్రవర్తనల కఠిన శిక్షలున్నాయన్న హెచ్చరికా ఉంది. వీటిలో కూడా స్థాయీ, తరగతులున్నాయి. ఏ స్థాయి దుష్కర్మలకు ఆ స్థాయి శిక్షలే ఉన్నాయన్నమాట. అల్లాహ్ తన అనంతమైన విజ్ఞాన వివేకాలతో పుణ్యపాపాల శిక్షలను ఎంతో న్యాయబద్ధంగా నిర్ణయించాడు.

అందుకే రెండు నాలుకల వాడికి (ద్వంద్వ వైఖరి, ఇదొక రకమైన కపట స్వభావం) ప్రళయదినాన

అతడి నోట్లో రెండు అగ్ని నాలుకలు ఉండే శిక్ష నిర్ణయించబడింది. (అల్లాహ్ మనల్ని రక్షించుగాక) కొన్ని రకాల జంతువులకూడా రెండు నాలుకలుంటాయి. కొన్ని పాములకు రెండు నాలుకలుండడం మనకు తెలిసిన విషయమే.

ఇక్కడ మనందరం ఒక విషయాన్ని అర్థం చేసుకోవాల్సి ఉంది. కొన్ని దుష్కార్యాలు, దుష్ప్రవర్తనలు నిజంగా ఎంతో భయానకమైనవి. అల్లాహ్ దృష్టిలో అత్యంత తీవ్రమైనవీను. కాని మనం వాటిని చాలా మామూలు విషయాలు అనుకుంటాం, వాటి నుండి రక్షింపబడడానికి ఎంతగా ప్రయత్నించాలో అంతగా వాటి గురించి ఆలోచించం. ఇలాంటి చెడులను గురించే పవిత్ర ఖుర్ఆనులో ఇలా సెలవీయబడింది:

వతహ్సబూనహూ హయ్యినం వహువ ఇందల్లాహి అజీం"

(మీరు చాలా చిన్న విషయమని, మామూలు విషయమని భావించేదే, అల్లాహ్ దృష్టిలో చాలా గొప్ప విషయం, తీవ్రమైన విషయం).

ద్వంద్వ వైఖరి అన్న ఈ దురలవాటు కూడా ఆ కోవకు చెందిందే. చాలా మంది దీన్ని చాలా సామాన్య విషయంగా భావిస్తుంటారు. దీనికి దూరంగా ఉండాలన్న, దీన్నుండి రక్షింపబడాలన్న ధ్యాసే ఉండదు. కాని ఇది ఎంత పెద్ద భయంకరమైన తప్పిదమో ఈ రెండు హదీసుల ద్వారా మనకు తెలిసిపోయింది. పరలోకంలో ఎంతటి భయానక శిక్ష అనుభవించవలసి ఉన్నదో కూడా తేటతెల్లమైపోయింది.

———— o ————

(3) హజ్రత్ జాబిర్ రజియల్లాహు అన్హు గారి కథనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఈ విధంగా ప్రవచించారు: మీలో ఎవరయినా మస్జిద్‌లో నమాజు చేసుకున్న తరువాత కొన్ని నమాజులు ఇంటి కొరకు కూడా ఉంచుకోవాలి. నిస్సందేహంగా అతని నమాజు మూలంగా అల్లాహ్ అతని ఇంట్లో శుభాన్ని అవతరింపజేస్తాడు. (ముస్లిం)

2. ఫజర్ నమాజు యొక్క సున్నతులను చదివుకున్న తరువాత కాసేపు పరుండడం సున్నత్ ఆగి భిన్నమయ్యమా. నిజమేనా?

జ: దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు రాత్రి తహజ్జుద్ నమాజు చేసిన తరువాత కాస్త అలసట తీర్చుకోడానికి కొన్ని సార్లు అజాన్ తరువాత సున్నత్ నమాజు చేసుకుని, కొన్ని సార్లు అజాన్‌కు ముందు కుడి ప్రక్కన పరుండేవారు. ఇది సున్నత్. హజ్రత్ ఆయిషా రజి వారి కథనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఫజ్ర్ వేళ రెండు రకాతుల (సున్నత్) నమాజ్ (ఇంట్లో) చేసుకున్న తరువాత కుడి వైపునకు తిరిగి పరుండేవారు. (బుఖారీ)

ఈ విధంగా సున్నత్ నమాజు తరువాత కాసేపు పరుండడం అభిలషణీయము అని విద్వాంసులు పేర్కొన్నారు. అబూదావూద్, తిర్మిజీ లోని ఓ ఉల్లేఖనం ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తమ ఉమ్మత్‌కు కూడా ఇలా ఫజ్ర్ నమాజు యొక్క సున్నతుల తరువాత కాసేపు పరుండమని ఆదేశించారు. కాని ఇది ఇంటో సున్నతులు చదివిన వారికి మాత్రమే. మసీదులో ఇలా చేస్తే హజ్రత్ ఉమర్ ర.జి వారు రాళ్ళతో కొట్టి వారిని లేపేవారు. (ముసన్నఫ్) అలాగే, అలా పరుండడం వలన నిద్ర పట్టి ఫజ్ర్ నమాజు చేజారిపోయేందుకు అవకాశం ఉంటే మాత్రం ఇలా చేయరాదని విద్వాంసులు పేర్కొన్నారు.

మేరాజున్నబీ ﷺ

సహీ ముస్లింలో హజ్రత్ అనస్ ర.జి గారి కథనం ప్రకారం దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు ఈ విధంగా తెలియజేశారు: "నా వద్దకు ఓ బురాఖ్ ను తీసుకొచ్చారు, అది తెల్ల రంగు గల నాలుగు కాళ్ళ జెంతువు. అది గాడిద కంటే పొడవైనది, ఖచ్చర్ కంటే చిన్నది. అది తన కంటి చూపు ఎంత దూరం పోతుందో అంత దూరం తన ఒకొక్క అడుగు వేసేది. దానిపై నన్ను బైతుల్ మఖ్దిస్ కు తీసుకొచ్చారు. అక్కడ చేరుకొని దైవ ప్రవక్తలు తమ జంతువులను ఎక్కడైతే కట్టి ఉంచేవారో నేను కూడా బురాఖ్‌ను అక్కడే కట్టి మసీదులోకి ప్రవేశించాను. అక్కడ రెండు రకాతులు నమాజు చేసి బయటకు రాగా హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు ఓ పాత్రలో పాలు మరో పాత్రలో మధ్యము తీసుకొని వచ్చారు. నేను పాలును ఎంచుకున్నాను. అప్పుడు ఆయన "అనసబ్‌తల్ ఫిత్రహ్" అనగా ప్రవక్తలు దేనయితే ఇష్టపడతారో మీరు కూడా దాన్నే ఎంచుకున్నారు అని అన్నారు. ఆ తరువాత

హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని ఆకాశాల వైపుకు తీసుకు వెళ్ళారు. మొదటి ఆకాశానికి చేరుకోగా హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు అక్కడ నియమించబడిన దైవ దూతతో ద్వారం తెరవమని అన్నారు. ఆ దైవ దూత ముందు ఇలా ప్రశ్నించాడు: ఓ జిబ్రయీల్ ! మీతో పాటు ఇంకెవరు ఉన్నారు? నా తో పాటు 'ముహమ్మద్' ఉన్నారు అని జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు జవాబిచ్చారు. ఆ దూత మళ్ళీ ప్రశ్నించాడు: వారికి అల్లాహ్ తఆలా తరుఫు నుండి ఆహ్వానము ఉందా? జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు "అవును వారిని అల్లాహ్ తఆలా ఆహ్వానించారు" అని జవాబిచ్చారు. ఇది వినగానే ఆ దూత 'మర్‌హబా' (స్వాగతం) అంటూ ఆకాశ ద్వారాన్ని తెరిచాడు.

(మొదటి ఆకాశం యొక్క ద్వారాన్ని బాబుల్ హఫజా అంటారు. ఈ ద్వరము వద్ద ఉన్న దైవ దూత పేరు ఇస్మాయీల్, అతడి ఆధీనములో 12000 మంది దైవ దూతలు ఉంటారు. ప్రతీ దూత క్రింద మరో 12000 మంది దూతలు ఉంటారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఖుర్‌ఆన్ లోని ఈ వచనాన్ని చదివారు: "నీ ప్రభువు సైన్యము ఎంత ఉందో ఒక్క నీ ప్రభువికి తప్ప ఇకెవ్వరికీ తెలీదు ఫత్‌హుల్ బారీ: 7/209; ఇబ్నె హిషామ్)

మొదటి ఆకాశం పై హజ్రత్ ఆదమ్ అలైహిస్సలామ్ గారు కలిసారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మానవులందరి తండ్రి అయిన హజ్రత్ ఆదమ్ అలైహిస్సమ్ గారికి సలామ్ చేయగా వారు సలామ్ కు ప్రతిసలాము చేసి "మర్హబమ్ బిక మిన్ ఇబ్‌నిన్ వ నబియ్యిన్"

(మా సంతానము మరియు ప్రవక్త అయిన మీకు స్వాగతం) అంటూ వారిని ఆహ్వానించారు. (వారి మధ్య ఇక ఏమి సంభాషణ జరిగిందో అది అల్లాహ్ కే తెలుసు. కొన్ని ఉల్లేఖనాల ద్వారా హజ్రత్ ఆదమ్ అలైహిస్సలామ్ గారి కుడి వైపున పుణ్యాత్ముల ఆత్మలు, ఎడమ వైపున పాపాత్ముల ఆత్మలు ఉన్నట్లుగా తెలుస్తుంది.) అక్కడి నుండు జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని రెండవ ఆకాశానికి తీసుకెళ్ళారు. ఆకాశ ద్వారం వద్ద మళ్ళీ అదే సంభాషణ జరిగింది. ద్వారాని తెరవమని హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు కోరగా అక్కడ నియమింపబడ్డ దైవ దూత మీతో పాటు ఎవరొచ్చారు? అల్లాహ్ తఆలా వారిని తీసుకురమ్మని చెప్పారా? అని ప్రశించాడు. దానికి నా తో 'ముహమ్మద్' ఉన్నారు, వారిని తీసుకురమ్మని అల్లాహ్ ఆదేశించారు" అని హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ వారు జవాబిచ్చారు. వెంటనే ఆ దూత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని స్వాగతిస్తూ ద్వారాన్ని తెరిచాడు. రెండవ ఆకాశంలో హజ్రత్ ఈసా మరియు హజ్రత్ యహ్యా అలైహిమస్సలామ్ కలిశారు. వారు మర్హబమ్ బిక మిన్ అఖిన్ వ నబియ్యిన్ (స్వాగతం ఓ సోదరా ! ఓ దైవ ప్రవక్తా !) అంటూ వారిని ఆహ్వానించారు. (వారి మధ్య జరిగిన సంభాషణ దేవుడే ఎరుగు) అక్కడి నుండి మూడవ ఆకాశానికి తీసుకెళ్ళారు. అక్కడి దూతతో కూడా అదే సంభాషణ జరిగింది. అల్లాహ్ తఆలా అజ్ఞ మేరకు హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ వారు దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని తీసుకొచ్చారని తెలుసుకోగా అక్కడి దూత కూడా మర్హబా (స్వాగతం) అంటూ ఆకాశ ద్వారాన్ని తెరిచాడు, మీ రాక శుభము అంటూ వారిని పలకరించాడు. మూడవ ఆకాశము పై హజ్రత్ యూసుఫ్ అలైహిస్సలామ్ గారిని కలవడం జరిగింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు సలామ్ చేయగా హజ్రత్ యూసుఫ్ అలైహిస్సలామ్ వారు జవాబుగా ప్రతి సలాము చేస్తూ మర్హబమ్ బిక మిన్ అఖిన్ వ నబియ్యిన్ (స్వాగతం ఓ సోదరా ! ఓ దైవ ప్రవక్తా) అంటూ వారికి స్వాగతం పలికారు. (అక్కడ జరిగిన సంభాషణ దేవునికే తెలుసు) అక్కడి నుండి నాల్గవ ఆకాశానికి చేరుకున్నారు. ప్రశ్నోత్తరాల తరువాత ద్వారం తెరవబడింది, దైవ దూత ప్రవక్త గారికి స్వాగతం పలికాడు. నల్గవ ఆకాశం పై హజ్రత్ ఇద్రీస్ అలైహిస్సలామ్ గారిని కలిసారు. వారి మధ్య కూడా సలామ్ ప్రతి సలామ్‌లు జరిగాయి, వారు కూడా ఇతర ప్రవక్తల లానే మీకు స్వాగతం ఓ సోదరా ! ఓ దైవ ప్రవక్తా అంటూ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని ఆహ్వానించారు. ఆ తరువాత ఐదవ ఆకాశాన్ని చేరుకున్నారు. అక్కడ హజ్రత్ జిబ్రయీల్ మరియు అక్కడి దైవ దూతకు మధ్య అదే సంభాషణ, ఆ పై గౌరవ ప్రధంగా ప్రవక్త వారిని ఆకాశం మీదకు స్వాగతించడం జరిగింది. అక్కడ హజ్రత్ హారూన్ అలైహిస్సలామ్ గారిని కలవడం జరిగింది. వారిని కూడా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు సలామ్ చేశారు. వారి సలామ్‌కు జవాబిచ్చి వారు కూడా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని ఆహ్వానించారు. అక్కడి నుండి ఆరవ ఆకాశానికి వెళ్ళారు. అక్కడి దైవ దూత హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ వారిని ప్రశ్నించిన తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి కొరకు ద్వారాన్ని తెరచి వారిని స్వాగతించాడు. ఆరవ ఆకాశంలో హజ్రత్ మూసా అలైహిస్సలామ్ గారిని కలిసారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్

వారికి కూడా సలామ్ చేశారు. హజ్రత్ మూసా అలైహి స్సలామ్ గారు ప్రవక్త గారిని అవే పలుకులతో ఆహ్వానించారు. (వారి మధ్య ఏమి సంభాషణ జరిగిందో అల్లాహ్ కే తెలుసు, కాని) దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అక్కడి నుండి ముందుకు సాగుతుండగా హజ్రత్ మూసా అలైహిస్సలామ్ గారు కన్నీరు పెట్టుకున్నారు. మీరు ఎందుకు ఏడుస్తున్నారు? అని హజ్రత్ మూసా అలైహిస్సలామ్ గారిని ప్రశ్నించగా వారు ఇలా సమాధానమిచ్చారు: "ఓ వ్యక్తి నా తరువాత (లోక కళ్యాణార్థం ప్రజల వద్దకు) పంపబడ్డాడు. అతని ఉమ్మత్ లోని స్వర్గస్తులు నా ఉమ్మత్ లోని స్వర్గస్తుల కంటే శ్రేస్థులు మరియు నా ఉమ్మత్ కంటే అధిక సంఖ్యలో ఉంటారు." ఆ తరువాత హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారిని తీసుకుని ఏడవ ఆకాశానికి వెళ్ళారు. ప్రశ్నోత్తరాల తరువాత ద్వారము తెరవబడింది. అక్కడ హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్ గారిని కలుసుకున్నారు. ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారి సలామ్ కు ప్రతి సలామ్ చేసి మర్హబమ్ బిక మిన్ ఇబ్‌నిన్ వ నబియ్యిన్ (ఓ నా తనయుడా (సంతతికి చెందిన వాడా) ! ఓ దైవ ప్రవక్తా !) అంటూ హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్ వారు పలకరించారు.

ఆ తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి "బైతుల్ మామూర్" చూపించడం జరిగింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు "ఇది ఏమిటి?" అని హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ వారిని ప్రశ్నించారు. దానికి జవాబుగా: "ఇది బైతుల్ మామూర్" ఇక్కడ దైవ దూతలు ప్రదక్షణలు చేసి నమాజు చేస్తారు. బైతుల్ మామూర్‌కు ప్రదక్షణ చేసి, అందులో నమాజు చేసే భాగ్యం ప్రతీ దైవ దూతకి జీవితంలో ఒక్క సారి మాత్రమే లభిస్తుంది. ఇక్కడ ఒక్క సారి ప్రదక్షణ చేసిన తరువాత మళ్ళీ వారి వంతు రానే రాదు" అని హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సలామ్ గారు అన్నారు. కొన్ని ఉల్లేఖనాల ఆధారంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు హజ్రత్ ఇబ్రాహీమ్ అలైహిస్సలామ్ వారిని కలిసినప్పుడు వారు బైతుల్ మామూర్‌కు ఆనుకొని కూర్చుని ఉన్నట్లుగా తెలుస్తుంది.

ఆ తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి "సిద్రతుల్ ముంతహా" చూపించారు. అదో పెద్ద వృక్షము. దాని ఆకులు ఏనుగు చెవుల వలే పెద్దవిగా ఉన్నాయని, దాని పండ్లు రాతి కుండంత పెద్దవిగా ఉన్నాయని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారు తెలిపారు.

చూస్తుండగానే "సిద్రతుల్ ముంతహా"పై దేవుని సృష్టితాల్లో నుండి ఓ అపురూపమైన జాతి సృష్టితాలు వచ్చి వాలాయి. అవి వాలిన తరువాత సిద్రతుల్ ముంతహా సౌందర్యం ఎవరూ వర్ణించలేనంతగా పెరిగిపోయింది.

సిద్రతుల్ ముంతహా క్రింద దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు 4 సెలయేళ్ళను చూశారు. అందులో రెండు అగుపడేవి, రెండు అగుపడనివి. వాటి గురించి హజ్రత్ జిబ్రయీల్ అలైహిస్సమ్ వారిని ప్రశ్నించగా కనబడే సెలయేళ్ళు నైలు, ఫురాత్ అని, కనబడనివి స్వర్గపు సెలయేళ్ళు అని సమాధానమిచ్చారు.

ఆ తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు అల్లాహ్‌ను సమీపించారు. అల్లాహ్ తఆలాతో సంభాషించారు. కాని ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు ఆ సమయంలో అల్లాహ్‌ను చూశారా లేదా అనే విషయంలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనం

ప్రకారం దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మేరాజ్ రాత్రి అల్లాహ్ తఆలా యొక్క దర్శన భాగ్యాన్ని పొందారు. కాని హజ్రత్ ఆయిషా సిద్దీఖా రజియల్లాహు అన్హా గారు దీన్ని నిరాకరించారు. దివ్య ఖుర్ఆన్‌లో కంటితో అల్లాహ్‌ను చూడలేరని ఉంది కాబట్టి ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు కూడా చూసుండరు అని వారు అభిప్రాయపడ్డారు. మరి కొన్ని ఉల్లేఖనాల్లో దేవుని తెజస్సును చూశారని ఉంది. ఎక్కువ శాతం విద్వాంసులు హజ్రత్ అబ్దుల్లాహ్ ఇబ్నె అబ్బాస్ రజియల్లాహు అన్హు గారి ఉల్లేఖనాధారంగా దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారికి దర్శన భాగ్యం కలిగిందని అభిప్రాయపడ్డా కొంత మంది విద్వాంసులు హజ్రత్ ఆయిషా రజియల్లాహు అన్హా గారి మాటల ఆధారంగా వారిని దర్శంచలేదని అభిప్రాయపడ్డారు.

ఆధారాలు స్పష్టంగా లేనప్పుడు మనం ఏ విషయాన్ని తేల్చి చెప్పకూడదు. అందుకే ఈ విషయంలోనూ వాస్తవం జ్ఞానం అల్లాహ్ మరియు వారికి ప్రవక్తకు మాత్రమే ఉందని, మనకు దీని జ్ఞానము లేదని వదిలేయాలి. ఇందులో చర్చలు అనవసరం. ఇక స్పష్టమైన ఆధారాలతో మనకు తెలిసిన విషయం ఏమిటంటే ఆ సందర్భములో అల్లాహ్ తఆలా కొన్ని ఆదేశాలను, కొన్ని పవిత్ర ఖుర్ఆన్ వచనాలను అవతరింపజేశారు. వాటిలో అతి ముఖ్యమైన ఆదేశం నమాజ్.

ఆరంభంలో దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారికి రోజుకు 50 పూట్ల నమాజు చేయమని ఆదేశించబడింది. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు దైవాదేశాలను తీసుకుని తిరిగి ఆకాశాల నుండి క్రిందికి బయలుదేరారు. మధ్యలో హజ్రత్ మూసా అలైహిస్సలామ్ గారు ఎదురయ్యారు. "మీ ఉమ్మత్ పై అల్లాహ్ విధించిన విధులేమిటి?" అని దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ గారిని ప్రశ్నించారు. వారు "నా ఉమ్మత్ ను రోజుకు 50 సార్లు నమాజు చేయమని ఆదేశించారు" అని సమాధానమిచ్చారు. దానికి హజ్రత్ మూసా అలైహిస్సలామ్ వారు ఇలా అన్నారు: "మీరు వెంటనే వెనక్కి వెళ్ళి, నా ఉమ్మత్ పై కనికరించి ఇందులో కాస్త రాయితీ ఇవ్వండి అని దరఖాస్తు చేయండి. ఎందుకంటే మీ ఉమ్మత్ పై ఇది పెద్ద భారమైపోతుంది. వారు ఈ ఆజ్ఞను సిరసావహించలేరు. నేను అనుభవంతో చెబుతున్నాను. బనీఇస్రాయీల్ సంతతని నేను చూశాను". హజ్రత్ మూసా అలైహిస్సలామ్ వారి మాటలు విన్న తరువాత దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు వెనక్కి వెళ్ళి అల్లాహ్ తఆలా తో ఈ విధంగా దరఖ్వాస్తు చేశారు: "ఓ అల్లాహ్ ! నా ఉమ్మత్ పై కనికరించి వారిపై విధించిన నమాజుల సంఖ్యను తగ్గించండి. ఎందుకంటే నా ఉమ్మతీలు చాలా బలహీనులు. వారు ఈ ఆదేశాన్ని సిరసావహించలేరు." అల్లాహ్ తఆలా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారి విన్నపాన్ని మన్నించి 5 నమాజులు తగ్గించి రోజుకు 45 సార్లు నమాజు చేయమని ఆదేశించారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు తిరిగి హజ్రత్ మూసా అలైహిస్సలామ్ వారి వద్దకు వచ్చి అల్లాహ్ నా ఉమ్మత్ పై కనికరించి 5 నమాజులను తగ్గించారని అన్నారు''. హజ్రత్ మూసా అలైహిస్సలామ్ వారు "మీ ఉమ్మతీల్లో ఈ ఆదేశాన్ని పూర్తి చేసే శక్తి కూడా లేదు. మీరు వెళ్ళి మళ్ళి అల్లాహ్ ను వేడుకోండి. మరింత రాయితీ కల్పించమని కోరుకోండి" అని అన్నారు. దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లమ్ వారు మళ్ళీ వెళ్ళి మరో 5 నమాజులు తగ్గించుకుని వచ్చారు. కాని మూసా అలైహిస్సలామ్ వారు వారితో మళ్ళీ ఇవే

